# జన్నతి

- సాయిలక్ష్మి

జన్నతి, ఒక యువతి హాలులో అడుగుపెట్టగానే కొన్నిక్షణాలు హాలు నిశ్శబ్దముగా అయిపోయింది. ఈ నిశ్శబ్దము ఎందుకు ఎప్పుడు ఎలా జరుగుతుందో ఎవ్వరికి తెలియదు. జన్నతి వచ్చినందువల్లనేనా? జన్నతి 'సైలెన్స్' గాని 'నిశ్శబ్దము' కాని అనలేదే! మరి కారణం? ఈ నిశ్శబ్దములో సమస్తము ఆగిపోతుంది. కదలిక మెదలికలతో పాటు ఆలోచనలుకూడా!.....ఈ నిశ్శబ్దము ఎంత ఆనందంగా ఉంటుందో ఎవరైనా గుర్తిస్తారా? దీనికి కారణము భగవంతునికే తెలుసేమో! లేక భగవంతుని నవ్వు కాదు కదా?....

ఆ క్షణాలు దాటి పోగానే అందరూ ఎందుకిలా జరిగిందో ఆలోచించి అది జన్నతి వలనే వచ్చిందనుకుంటారు. కానీ జన్నతి వచ్చినపుడే ఎందుకు జరగాలి? ఆమెలో అంత ప్రత్యేకత ఉందా?

ఆ రోజు హాలులో ఓ పెద్ద పార్టీ జరుగుతోంది. రెండువందల వరకు పిల్లా, పెద్దా అంతా కలిసి ఉండొచ్చు. కొంత మంది టేబుళ్ళ చుట్టూ ఉన్న కుర్చీలలో స్నాక్స్ తింటూ లోకల్ పొలిటికల్ పిచ్చాపాటి మాట్లాడుతూ కూర్చున్నారు. కొంతమంది కూర్చోమన్నా వినకుండా నలుగయిదురు కలిసి నుంచొని మాట్లాడుతున్నారు. పిల్లలదేముంది? దొరికిందే ఛాన్సు అని పెద్దల మాట పట్టించుకోకుండా గెంతులు. అరుపులు. ఆడవాళ్ళు తమ తమ అందాల్ని, చీరల షోకులను, నగల నాణ్యతను అందరూ చూస్తున్నారో లేదో అనుకుంటూ బయటికి మాత్రము ఇతరుల యోగక్షేమాలు అడుగుతున్నారు. కుర్చీల జరుపుడు, గ్లాసులు, స్పూన్లచప్పుడు అకడక్కడ. అటువంటి గందరగోళములో జన్నతి అడుగుపెట్టింది. నిశ్శబ్దం...నిశ్శబ్దం. జన్నతి కూడా గుర్తించింది. కొంచెంసేపు అలా నిలబడిపోయింది. ఆ నిశ్శబ్ద క్షణాలు గడువగానే గోల మొదలయ్యింది. ఆ గోల కూడా ఎవ్వరు ముందు మొదలెట్టారో కూడా తెలియదు. "జన్నతీ ఇలా రా!" అన్న అరుణ పిలుపుకు జన్నతి కదలగానే చాలా కళ్ళు, ఒళ్ళు అటు తిరిగాయి.

ఓ టేబులు దగ్గర కూర్చున్న జగపతిగారి కళ్ళు అటుచూశాయి. ఆయనకు అర్థమైంది. ప్రశాంత మయిన మొఖము చక్కటి కళ్ళు, అంగసౌష్టవముతో నున్నది ఆమె. ముప్పై ఏండ్లు ఉండొచ్చు. నిర్మలమైన నవ్వు. కానీ ఎక్కడో చూసినట్లుంది అనుకుని ఇటుతిరిగారు. ఆయన పక్కన కూర్చున్న రెడ్డిగారు 'ఆవిడ జన్నతి అని అరుణగారి ఆఫీసులోనే పనిచేస్తుంది' అని ఇంకా ఏదో చెప్పాలన్నట్లుగా మొఖము పెట్టారు. జగపతి గారు 'అలాగా' అని సంభాషణ పొడిగించటానికి ఇష్టపడనట్లు మొఖము పెట్టారు. కానీ క్రీగంట అక్కడే జరిగేవి చూస్తూనే ఉన్నారు.

కాసేపటికి భోజనాల టేబులు దగ్గర అరుణ జగపతిగారికి జన్నతిని పరిచయం చేసింది. పరిచయము చాలా మామూలుగా ఉన్నా జన్నతి కళ్ళు ఆయనలో ఆందోళన కలుగజేశాయి. జన్నతి జగపతి గారి వంక చూడగానే తడబడింది. తడబాటు చూసి అప్పుడప్పుడు స్త్రీ తన సహజత్వము అలా చూపిస్తుందని సరిపెట్టుకున్నారు. కానీ భోజనము చేస్తున్నంతసేపు ఆయన ఆలోచనలు. అప్పుడప్పుడు ఆ జన్నతి కళ్ళ గురించి నవ్వు గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. పార్టీ అయి పోయాక ఆయన తన మోటల్ కి వచ్చారు. ఆ రాత్రంతా ఆయనకి నిద్ర సరిగా పట్టలేదు. 'తన ఏభై అయిదేళ్ళ జీవితములో ఇంత అసహనంగా నిద్రపట్టని రోజు లేదు. జన్నతి అన్న పేరు వినలేదు. తన చేసె ఉద్యోగంలో కేంపులున్నప్పటికీ ఎక్కడా చూసిన గుర్తు లేదు.' అని అనుకుంటూనే ఉన్నారు. 'తన స్నేహితుడి స్నేహితుడి భార్య

అరుణను అడగొచ్చుకానీ బాగుండదు' అని అనుకున్నారు.

తెల్లవారిన తరువాత జగపతిరావుగారు స్నేహితుని కారు కోసము వెయిట్ చేస్తూ మోటెల్ బయటికి వచ్చారు. ఆయనకు ఎదురుగా నీరెండలో విచ్చిన తెల్లని పూలు నిర్మలంగా పలకరించి నట్లని పించింది. 'అరే! మల్లికా! ఎంత చక్కగా గుర్తుకు తెచ్చాయి ఈ పూలు. మల్లికని. ఆ నిర్మలత్వపు నవ్వు మల్లిక నవ్వే! ఇప్పుడెక్కడుందో? ...అనుకొంటున్నప్పుడు స్నేహితుని కారు వచ్చింది. తరువాత ఆయన మల్లికను మరిచే పోయారు. తపన పడిన మనసు, దాని జవాబు అదే వెతుక్కుని సంతృప్తి చెందితే మరుపేనేమో.

నాలుగు రోజుల తరువాత ఆఫీసు నుంచి రాగానే ఫోను ఆన్సరింగ్ మెషీనులో మెసేజ్. 'నా పేరు జన్నతి. నేను మిమ్మలిని కలవాలనుకుంటున్నాను. రేపు సాయంత్రము - ఆరుగంటలకు మీరున్న మొటెల్ కు వస్తాను' అని మెసేజ్.

'ఎందుకు జన్నతి నన్ను కలవాలనుకుంటుంది. జన్నతికి మల్లిక లా నిర్మలమైన నవ్వు. కళ్ళున్నాయి కానీ మల్లిక కాదే మల్లికని చూసి ఇరవైయేళ్ళ పైనే అయింది. మల్లిక చిన్నపిల్ల. ఇలా మారిందా? పీలక జడ, అతి సన్నగా బెరుకు చూపులతో ఉండేది.

ఇలా మారిందా? కాదేమో!..అనుకున్నారు. అవును అనుకోటానికి ఆస్కారము కూడా లేదే అమెరికా రావడానికి ఛాన్స్ లేనే లేదు! అని నిట్టూర్చారు జగపతి బాబు.

* * * *

ఆ రోజు మోటెల్ బయట జన్నతి కోసము జగపతి రావు గారు ఎదురుచూస్తూ చుట్టుపక్కల నడుస్తున్నారు. కాసేపటికి జన్నతి మోటెల్ మెయిన్ గేటుకు నడుస్తూ కనిపించింది. ఆకుపచ్చ అంచున్న తెల్లని చీరెలో హంస నడకతో మెల్లగా నడుస్తూ కనిపించింది. 'అరవిరిసిన బొండుమల్లెలా ఉన్నది' అని అనుకున్నారు. ఆయన లోపలికి వచ్చేటప్పటికి జన్నతి లౌంజ్ లో కూర్చునుంది. జగపతిరావు గారిని చూడగానే లేచి నుంచొని నమస్కారము పెడుతూ "మీరు కె.దుర్గాజగపతి గారు కదా! కె.డి. జగపతి కదూ!" అని నవ్వింది. నవ్వు, కళ్ళు ఆయనకు మల్లికని గుర్తుకు తెచ్చాయి. అయినా ఆయన గంభీరంగా 'అవును' అని అన్నారు.

'బాబుగారూ! నేను మల్లికను. మీకు గుర్తుందో లేదో. మీరు చెప్పిన మాటలు నా జీవితాన్ని మార్చివేశాయి బాబూ. కృతజ్ఞతలు చెప్పటానికి వచ్చాను బాబూ' అని అంది. 'అరే! మల్లికా! గుర్తున్నావు మల్లికా. నిన్ను పార్టీలో చూడగానే ఎక్కడో చూశాననుకున్నా కానీ తరువాత గుర్తుకొచ్చావు. ఎలా ఉన్నావు? అమెరికా ఎప్పుడు వచ్చావు?' అని ఆత్రంగానే అడిగారు. మల్లిక అటూ ఇటూ చూస్తూ 'మీతో చాలా చెప్పాలి బాబూగారు. మా ఇంటికి వెడదాము. నేను మళ్ళీ ఇక్కడ దింపేస్తాను. మీకు అభ్యంతరమైతే...' అంటూ ఉండగా 'పద వెడదాము' అని మల్లికని బయలుదేర తీశారు. కారు దగ్గరకు నడుస్తుండగా ఎవరి ఆలోచనలో వాళ్ళున్నారు.

కనీసము ఓ పాతికేళ్ళ క్రితము 'బాబుగారు! నాతో మాట్లాడరూ! రౌడీలు వెంటబడుతున్నారు' అని చార్మినారు బస్సు స్టాండులో దీనంగా అడిగింది ఓ చిన్నపిల్ల. పాత స్కూలు యూనీఫారంలో ఉంది. చేతులో చిరిగి అవసాన దశలో నున్న పుస్తకాలు. ఆ కళ్ళలోని బెదురు చుపులు చూస్తూ అప్రయత్నంగా 'ఎవరు వెంటబడుతున్నారు' అని చుట్టూ చూస్తూ 'భయపడక. నీ పేరేమిటి.' అని అంటూ జేబులోంచి పర్సులోని ఒక విజిటింగ్ కార్డ్ తీసి చూపించారు. దానిమీద కె.డి. జగపతి అని అక్షరాలు చూసి అమ్మాయి ముసిముసినవ్వులు నవ్వింది. అదేమి పట్టించుకోకుండా ఆ కార్డ్ మీద నున్న ఎర్రటి పట్టీ చూపించి కార్డ్ ను నాలుగువైపులా చూపించారు. దూరంగ నున్న ఇద్దరూ రౌడీల్లాంటి వారు వెళ్ళిపోయారని గమనించారు. 'మీరు మఫ్టీలో నున్న పోలీసులా' అని అడిగింది. గట్టిగా నవ్వుతూ 'అలా

ఎందుకనుకున్నావు?' అని అడిగారు. 'మీరు ఇంత పెద్దగా ఉన్నారు. మీదగ్గర పైన ఎర్ర చారున్న కార్డ్ కూడా ఉంది' అన్నది. సెంట్రల్ గవర్నమెంటులో సీనియర్ ఆఫీసరన్ని, అది తన ఐడి అని చెప్పలేదు మల్లికకు. 'ఓ! అని పద నిన్ను మీఇంటి దగ్గర దింపుతాను. మా కారులో వెడదాము రా!' అని అన్నారు. 'అమ్మాయి బెదురు చూపులు చూసి 'మా డ్రైవరు ఉన్నాడులే రా!' అని చక చకా కారువైపు నడిచారు.

కారులో ఆ అమ్మాయి డ్రైవరుకు కుడి, ఎడమ వైపు అంటూ సూచనలిస్తోంది. 'ఏం చదువుతున్నావు. ఎక్కడినుంచి వస్తున్నావు?' అని అడిగారు. 'ఎనిమిదవ క్లాసు. రోషనారా దగ్గరనుంచి తొమ్మిదో క్లాసు పుస్తకాలు తెచ్చుకుంటున్నాను. నన్నెవరూ స్కూలుకు పంపించరు' అని దిగులుగా అంది. - తనకు కు నవ్వు వొచ్చింది. రోషనారా తనకు పరిచయమున్నట్టు మాట్లాడుతుంటే' అని అలోచిస్తూండగా.

జన్నతి కారు తలుపు తీస్తూ 'కూర్చోండి బాబుగారు' అంది. - ఆలోచనలనుంచి తెప్పరిల్లి కారు ఎక్కారు. జగపతిగారు ఆఫీసు పని మీద అమెరికా వచ్చానని కొన్ని ఊళ్ళు తిరుగుతున్నానని చెప్పారు. కాసేపు అమెరికా మీద మాటలు జరిగాయి. జన్నతి 'అమెరికా దేశము అంత గొప్పది వేరే లేదు. ఎందరో దైవోప హతులకు ఆశ్రయమిస్తుంది. తమ దేశాల శిక్ష తప్పించుకోవటానికి, పారిపోయినవారికి, చదువులేని చుట్టాలకు, ముసలివారికి, చదువు ఉన్న విజ్ఞానవంతులకు ఆశ్రయమిస్తుంది' అని అన్నది. ఇంతలో కారు - ఆమె అపార్ట్‌మెంటు దగ్గరకు వచ్చింది.

అపార్ట్‌మెంటు తలుపు తీసి 'రండి బాబుగారు'. జగపతి గారు లోపలికి అడుగు పెడుతూ చుట్టు చూశారు. ఒక మూల పొందికగా ఓ చిన్న స్టూలు మీద తన ఫోటో ఉంది. - ఆశ్చర్యపోయారు. దగ్గర్కు వెళ్ళి చూశారు. దానిమీద 'బాబు గారు-శ్రేయోభిలాషి' అని వ్రాసి ఉంది. 'మీకు తెలియకుండా మీ ఫోటును స్కూలుకు వచ్చినపుడు తీయించాను. అది ఒక రమణయ్య గారికే తెలుసు. ఆయ నే తీయించి ఇచ్చారు. క్షమించండి' అన్నది జన్నతి. 'ఎవరైనా తెలిసినవారు చూసి ఉంటే' ఒక్క క్షణము అనిపించి ఆయన ముఖములో మార్పు వచ్చింది. కానీ దానిని సంబాళించుకొని 'రమణయ్య అంటే మీ స్కూలు క్లర్క్ కదూ.' అవును. ఆయనే. మీరు నా చదువుకు స్కూలు జీతము పంపించినపుడల్లా నాకు తెలియజేస్తూ ఉండేవారు. స్కూలు పైనలు కాగానే మీకు ఉత్తరము వ్రాస్తే ఆ ఉత్తరము వెనక్కి వచ్చింది. 'అవును. నేను ఆఫీసు పని మీద విదేశాలు వెళ్ళాను. మా కుటుంబము వాళ్ళ సొంత ఊరు వెళ్ళారు. నేను స్కూలుకు ఉత్తరము వ్రాస్తే జవాబివ్వలేదు.' అని జవాబిచ్చారు. 'అయితే ఏం బాబుగారు. మీ మాటలు చెరగని ముద్ర వేశాయి. ఇవ్వాళ ఇలా ఉండటానికి అవే కారణము. 'మన జీవిత ధ్యేయము సాధించుకోవటానికి మనమే దారులు వెతుక్కోవాలి. ఆ దారి కొత్తదారులకు దోహదము చేస్తుంది. అడ్డదారులను అదే తప్పిస్తుంది. దీని కంతా మన ధ్యేయము మీద ఉన్న పట్టుదల, శ్రమ యే కారణం' అన్నారు. అప్పుడు అర్థము కాకపోయినా మననము చేయటము వలన దాని అర్థము తరువాత తెలిసింది.' మళ్ళీ 'అయ్యో! బాబుగారు. నిలబడే ఉన్నారు. కూర్చోండి. కాఫీ తెస్తాను.' అని లోపలికి వెళ్ళింది.

జగపతి గారికి ఇదివరకు కారులో జరిగింది గుర్తుకు వచ్చింది. చిన్నపిల్లను కారులో ఎక్కికూర్చున్న తరువాత 'కె.డి. జగపతి' అంటే బలే నవ్వుగా ఉంది. కె.డి అంటె రౌడీ కదా. పైగా జగపతి అంటే..... అని చాలా సేపు నవ్వింది. తరువాత 'నీకు చదువుకోవా లనుకుంటే చదువుకోవచ్చు కదా!' అని అన్నారు జగపతి బాబు. కానీ కుదరదు. నాన్న లేరు ఎవరూ ఒప్పుకోరు అని అంది. తరువాత తనే వాళ్ళ అమ్మతో మాట్లాడి స్కూలు ఫీజు, పుస్తకాలకి డబ్బు పంపించేటట్లు ఏర్పాటు చేశాడు. అప్పుడే అని ఉంటాను ధ్యేయము గురించిన మాటలు అని అనుకున్నారు. 'మాటలకు ఎంతో శక్తి, ప్రభావము ఉంటాయి. ఎవరో ఎదో తెలిసీ తెలియక

మాట్లాడిన, మాటలు సూటిగా గుండెలకు తగిలి ఎన్నో మార్పులు తెస్తాయి. మంచికి, ఒకప్పుడు చెడుకు కూడా. అయినా తన మాటలు మంచికి దారి తీసినందుకు సంతృప్తితో ఆనందం పొందారు.

ఇంతలో కాఫీ, బిస్కట్లు తీసుకొచ్చింది జన్నతి. కాఫీ తీసుకొని 'ఇప్పుడు చెప్పు. ఇక్కడికి ఎలాగ వచ్చావు?' అని అన్నారు జగపతి బాబు. జన్నతి కాఫీ తీసుకుంటూ 'మీరు మొదటి రోజు అమ్మ తో పలికిన మాటలు కూడా అమ్మ మీద చాలా ప్రభావము చూపాయి. అమ్మ మీ మాటలతో అందరిని ఎదిరించి నాకు చదువు చెప్పించింది. స్కూలు జీతము మీరు కడుతూనే వచ్చారు బొంబాయి నుండి. తరువాత నాకు అన్నీ కష్టాలే. అమ్మతో మాత్రము 'నా చదువు సాగనీ. మీరు చెప్పినట్లే వింటాను. నాడబ్బు నేను సంపాదించుకుంటాను' అని చెప్పాను. కొన్నాళ్ళు నా మీద నిఘా ఉండేది కానీ మాటకు కట్టుబడి ఉంటానని తెలిశాక వదిలేశారు. పగలు రాత్రి నిద్రపోకుండా ఖాళీ దొరికినప్పుడల్లా చదువుకొనేదాన్ని. కానీ ప్రతి దానికి అడ్డంకులే. అమ్మ ఎప్పుడు మీ మాటలు చెబుతుండేది 'చదువు విజ్ఞానము మనోవికాసము ఇవ్వడమే కాకుండా వారి వారి వృత్తి సంపాదనకు గానీ వేరే వృత్తికి గానీ దారి చూపుతుంది. సమాజములో ఉనికిని కూడా ఏర్పరస్తుంది' మాటలు.

మిగతా వారికి నా సంపాదన కావాలి. అలవాటు పడిన ప్రాణాలు కదా. మా అమ్మ నాకు తోడు గా ఉండబట్టే నా చదువు కొనసాగింది.

ఒకసారి నాకు రవి అన్న అబ్బాయి లైబ్రరీ లో పరిచయమయ్యాడుఆ పరిచయముతో నా చదువు బాగా సాగింది. అతను చాలా ధనవంతుడు. ఆ మిషతో మా ఇంటికి రాకపోకలు సాగించాడు. ఒకవిధముగా మా వాళ్ళ బారి నుండి తప్పించాడు. అతను అమెరికా వస్తూ నా పేరు జన్నతి అని పెట్టి నాకు పాస్ పోర్ట్, వీసా ఎంతో డబ్బు ఖర్చు పెట్టి తెప్పించాడు. వాళ్ళ వాళ్ళని ఎదిరించి, మా వాళ్ళతో ప్రాణాలకు తెగించి ఎదురించి, ఎన్నో లక్షలిచ్చి ఇక్కడికి తీసుకొచ్చాడు. అమ్మ నేను వచ్చిన రెండు రోజులకు ఆత్మహత్య చేసుకొని చనిపోయింది' అని కన్నీరు పెట్టుకొని గట్టిగా ఏడిచింది జన్నతి.

'అయ్యో! సూర్యకాంతం చనిపోయిందా?.. అనుకొని ఒక్క క్షణము జగపతి బాబు బాధ పడ్డారు. 'పోనీ ఒక విధముగా మంచిదే బతికుండి ఏం బావుకుంటుంది. అనుకొని సూర్యకాంతం మాటలు గుర్తు తెచ్చుకున్నారు 'బాబుగారు. పుట్టిన దగ్గర నుండి ఇక్కడే పెరిగాను. బయటి ప్రపంచము తెలియదు. ఇదే జీవితము అనుకునేదాన్ని. మల్లిక చదువుకోసము పోరి స్కూల్లో చేరింది. అది చెబుతేకానీ నాకు బయటి ప్రపంచము తెలియలేదు. కానీ ఏంచేయలేను. కానీ వేరే ప్రపంచము మల్లికకు చూపించలేను.' అని అంది. ఆమె బాష కర్ణ కఠో రముగా నున్నది. కానీ తనే మల్లిక చదువు గురించి చెప్పాడు.' తనకి తెలుసు చదువుకున్న ఎందరు జ్ఞానము సంపాదించ గలిగారు? వారి భుక్తికి అడ్డు పెట్టానేమో నని చాలా బాధ పడ్డాడు. ఇంకో సారి డ్రైవరు ను పంపితే సూర్యకాంతం 'బాబుగారు ఋణము తీర్చుకోవాలి. ఇక్కడికి తీసుకొనిరా!' అని చెప్పినపుడు డ్రైవరు తనను అపాత్ర దానము చేస్తున్నానని వాడి భాషలో చెప్పాడు. కానీ ఇప్పుడు పాత్ర దానమే అయినట్లుంది 'అనుకొని 'పాత్ర' దానము అనుకొని తనలో తనే నవ్వుకొన్నారు. కారులో మల్లికని 'మీఇంట్లో ఎవరుంటారు అంటే సంపంగి, జాజి, మందారం అదే మా మామ లెండి' అని చెబుతే 'తను అన్ని పువ్వుల పేర్లే అనుకున్నాడు. తరువాత తను వెళ్ళనే లేదు. బదిలీ మూలానా. ఉంటే వెళ్ళేవాడా?...... ఆయన ఆలోచనలను ఆపుతూ, 'వెళ్ళే టైము అయినప్పుడు చెప్పండి. మిమ్మల్ని దింపేస్తాను. బాబుగారు' అని అన్నది జన్నతి కళ్ళు తుడుచుకుంటూ జగపతి బాబు ఏమీ మాట్లాడలేదు. 'అమెరికాకు తెచ్చిన రవి గురించి అడగాలా వద్దా' అని ఆలోచిస్తున్నారు. జన్నతి తను ఏ

ఆఫీసులో పనిచేస్తోందో ఎలా మానేజ్ చేస్తోందో అన్ని చెబుతుంటే కొంచెం వింటూ అప్పుడప్పుడూ ఏవో చిన్నచిన్న ప్రశ్నలు వేశారే కానీ అన్యమనస్కంగానే ఉన్నారు. చీకటి పడే లోపే ఇంటికి వెడితే బాగుంటుందేమో అని అనుకున్నారు.

ఇంతలో ఒక చిన్న అరుపు వినిపించింది. అది పిల్లిదో కుక్కదో తనకి అర్థము కాలేదు. జన్నతి గభుక్కున లేచి తలుపు వేసిన ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది. జన్నతి మాటలు వినీవినిపించకుండా ఉన్నాయి కానీ ఎవరితో మాట్లాడుతోందో అర్థము కావటము లేదు. అయిదు నిమిషాలు తరువాత బయటికి వచ్చింది. 'ఏమైనా చెబుతుందనుకున్నారు కానీ జన్నతి ఏమీ మాట్లాడలేదు. జగపతి బాబుగారు 'ఖాళీగా ఉంటే భోజనానికి బయటకు వెడదామా?' అని అడిగారు జన్నతిని.

జన్నతి 'దైవోపహతులకు ఎప్పుడూ కష్టాలే బాబూగారూ!' మొహములో ఏభావము లేకుండా అని అంది. సుదీర్ఘంగా చూశారు ఆమె వైపు.

జన్నతి మూసిన తలుపు వైపు వెడుతూ తలుపు తెరుస్తూ 'రండి బాబుగారూ' అని అంది. జగపతి బాబు కొంచెం తటాపటాయించారు. లోపలికి వెళ్ళిన జన్నతి గట్టిగా 'రండి, బాబుగారు' అంది. ఆయన లోపలికి వెళ్ళి స్తాణువులా నిల్చుండి పోయారు. అక్కడ మంచం మీద ఓ పాడైపోయిన బొమ్మ ....కాదు...కాదు.. ఓ బక్క చిక్కిన ఆ-కారము ఉంది. చలనముందా? లేదా? అన్న అనుమానములో నున్నారు. కళ్ళ చూపు ఎటో! ప్రశ్నార్థకముగా చూశారు జన్నతి వైపు.

'రవి, రవి' అని అతని తలను తన వైపుకు తిప్పుకొంది. బొమ్మే!.... 'నాలుగు సంవత్సరాలు సంఘముతో దెబ్బలాడినా ఏదో హాయిగా ఉన్నాము. రెండు సంవత్సరాలు కష్టపడ్డా బాగానే ఉన్నాము. దేముని చేతిలోని బొమ్మను కదా! కారు ప్రమాదములో రవికి బలమైన గాయాలు తగిలి ఇలా అయిపోయాడు. ఒక వెజిటబుల్. ఏమీ చెయ్యలేమన్నారు డాక్టర్లు.' అని గద్గదింగా అన్నది. ఏమీ మాట్లాడలేక తలవంచుకొని బయటికి వచ్చి కుర్చీలో కూర్చున్నారు.

జన్నతి కూడా ఆయన ఆ వెనకే వచ్చి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుని కళనీళ్ళు పెట్టుకుంటూ కుర్చీలో 'నేనే తనకి స్వర్గం (జన్నత్) అనుకొన్నాడు.'

'జన్నతి అని పేరు పెట్టాడు కానీ తను నరకము అనుభవిస్తున్నాడు బాబూ! నేను కూడా!' అని అన్నది. అదివిన్న జగపతి బాబుగారికి జన్నతికి మంచి దారి చూపించాన్న - ఆనందం ఒక్కసారిగా ఆవిరి అయిపోయినట్లనిపించింది. 'తను ఆమెకు సహాయము చేసి అపకారము చేశాడా?' అని అనుకున్నప్పుడు ఆయనకు నిస్త్రాణగా అనిపించింది. పైగా ఈ విదేశములో తను ఆమెకు ఏవిధముగా సాయపడలేడు అన్న భావము ఆయన్ను ఇంకా నీరస పరిచింది. ఇంతలో జన్నతి లేచి 'పదండి బాబుగారు. మిమ్మల్ని మోటెల్ దగ్గ ర దింపేస్తాను' అని అన్నది. మౌనంగా బయటికి నడిచారు.

మోటెల్ దగ్గర జన్నతికి మౌనంగానే ఆమె భుజము మీద చెయ్యివేసి వీడ్కోలు చెప్పారు. ఎదురుగా తెల్లపూలు వడిలిపోయాయి. ఒక నిట్టూర్పు విడిచారు. కానీ వడిలిపోయిన పూల పక్కనే మరునాడు విరిసే పసిరి మొగ్గలు జగపతి బాబుగారికి జీవము పోసినట్లనిపించింది. జన్నతి అదే మల్లిక కర్మకు తానే కారకుడనుకున్నాడు. సుఖదుఃఖాలకు తను కర్తను అనుకున్నాడు. కానీ భగవంతుడు 'ఈ చరాచరసృష్టి యొక్క కర్మకు నేను భాధ్యుడను కాను. ప్రకృతి ధర్మము ననుసరించే కర్మ అనుసరిస్తుంది. కనుక ఈ సృష్టిలోనీ చరాచరాదుల సుఖదుఃఖాలకు, పాప పుణ్యాలకు నేను కర్తను కాను.' అని అన్నాడని గుర్తుకు వచ్చింది. ఆ ఆలోచన ఆయనకు జీవము పోసినట్లనిపించింది. కొంచెం తెప్పరిల్లినా - ఆయన ఆలోచన 'జన్నతి కర్మకు తాను కారణమైనాడా? అని అనుకున్నారు. భగవంతుని లీలలలో తానెంత?' ఎవరి కర్మకు వారే కర్తలు కదా! ప్రతివారునూ పూర్వజన్మ వాసనల వలన ,

సంస్కారముల వలన కలిగిన తమ ప్రకృతి ననుసరించే ప్రవర్తిస్తారు కదా!' అని ఎంత సంబాళించు కొన్నా ఆయనకు ఆలోచన తెగలేదు. ఇంకా ఇలా అనుకున్నారు. 'నిజంగా దైవోప హతురాలా? అందుకే.... ఆమె జన్మ? ఆమె దేవుని బొమ్మ. ఆనాడు కొందరికి తాత్కాలికంగా స్వర్గాన్ని చూపించే 'వారకాంత.' వేశ్య. ఈ నాడు తను నరకము అనుభవిస్తోంది. తను చేసిన బొమ్మను చూసి 'నిశ్శబ్దము' అన్న రూపములో భగవంతుడు నవ్వాడేమో!......'.